# బస్సులో

ఉదయం 7 గంటల బండికోసం కాకులు కుయ్యకుండా బయలుదేరి బస్‌స్టాండుకు వచ్చాను. అర్జంటు పని. వెళ్ళితీరాలి.

బస్సుకోసం కోటిమంది కూచున్నారు. ఫలితం సోమనాథుడికి తెలియాలి. స్టాండుకు వచ్చే ప్రతి కొత్త పాసింజరూ శత్రువులా కనపడుతున్నాడు.

దవనం జడలూ - సుద్దకూజాలూ,

కాగితం కట్టలూ - చంటిపిల్లల చంకలూ,

ఎక్కడినుంచో వచ్చి పడుతున్నాయి ఎగుమతికోసం.

బస్సు రాలేదు.

పేపరు మిల్లు చిమ్నీ అంత చుట్టలోంచి పొగ ఒదుల్తూ ఒక విగ్రహం వచ్చి నుంచుంది.

దాని చుట్టూ జనం ప్రదక్షిణం చేసింది. విగ్రహం ఒకసారి చుట్టతీసి ఉమ్మేసి ముందుకు నడిచింది.

జనం వెంబడించింది.

విగ్రహం కోరికలివ్వదురా అంటే ఈ పవిత్ర హిందూదేశంలో ఎవడు నమ్ముతాడు? అది కొన్ని టిక్కట్లూ, మరికొన్ని గొంతుకులూ, ఏకకాలంలో కోసి చేతులు కడుక్కుంది.

దుమ్మెత్తిపోస్తూ బస్సు వచ్చి ఒగరుస్తూ నించుంది.

ఎడాపెడా వంద చేతులు చాపి దాహం అంది, ఒక సోడా కొట్టు ఖాళీ. అబ్బ! బస్సు

కెంత దాహం! యజమానుల పోలిక - కాబోలు.

'గెటిన్ గెటిన్'

"ఎక్కండయ్యా, ఎక్కండి"

"అబ్బ... కాలు తొక్కారండీ సార్"

"సారీ..."

"గళ్ళ శారీ... ముందుసీట్లో సర్దుకుంది" జనాన్ని కారు గర్భంలోకి గిరవటేస్తున్నాడు కండక్టరు.

ఒక సిల్కు లాల్చీ మెడలో వాలుజడ... ఎండు చేపల బుట్టలో ఒక బ్రాహ్మణ వితంతువూ వెళ్ళి పడ్డారు.

కష్టపడి టిక్కెట్టు పుట్టించి కారుదగ్గర నించున్నాను. నాగరికత నలుగుతుందని భయం. ఎక్కలేక దిక్కులు... చూస్తున్నాను.

'టాపుమీద ఎక్కండి' అన్నాడొక కుశాగ్రబుద్ధి.

'బొగ్గులు బస్తాలు పైకి వెళ్ళడం మంచిది" అన్నాను. శ్యామసుందరుడు జనంలో మునిగిపోయాడు.

"బాబూ... పైకివస్తే... సర్దుకుందాం. మెత్తనివారికి కారులోనే కాదు.. ప్రపంచంలోనే చోటు దొరకదు."

ఎవరీ ధర్మమూర్తి? నా గౌరవాన్ని లాలించి కితకితలు పెట్టినట్టయింది. ఒక్క మాటతో మనిషిని కదలకుండా పట్టుకోవచ్చు తెలివి వుంటే -

తలెత్తి చూశాను.

జేగురు రంగు అంగరఖా... 50 ఏళ్ళ సాధువు చేయిచాచి సామాను కిటికీలోంచి అందుకుని లోపల పెట్టాడు.

మహానుభావుడు అనుకున్నాను.

సాధువు సగం తాను కూర్చుని తక్కిన సగంలో నన్నిరికించాడు.

బస్సు నడుస్తోంది.

"చెన్నపట్నం చేరగానే రాస్తావుగదూ.

మంగళవారం రిహార్సల్. మంచిది. ఖులాసాగా తిరిగిరా. జేబులో జాగర్త" - నా స్నేహితులు వెళ్ళిపోయారు.

బస్సు ఇష్టంలేని ఆడపిల్ల అత్తారింటికిలా స్టాండులోంచి గునిసి గునిసి బయలు దేరింది.

## 2

సాధువును పరఖాయించాను.

తల జడలుకట్టి మెడమీద పడుతున్నది. పెరిగిన గెడ్డం గుండెదాకా వుంది. కను బొమ్మలు బిరుసుగా బొద్దుగా వుండి దగ్గరికి లాగితే చూపుల్ని చురుకు చేస్తున్నాయి. కుడి చేతికి దేనివో ఎముక పూసలున్నాయి. రెండు కనుబొమ్మలూ కలిసేచోట లేచే సూర్యుడిలా పెద్ద కుంకంబొట్టు.

ఇదీ వేషం -

"వేషం వేస్తారా నాటకంలో - "

మీసం గెడ్డం చిట్టడవిలోంచి సాధువు మూతి మాటాడింది.

నాకు ఒళ్లు మండింది.

'తమరు దెయ్యాల్ని ఒదలగొడతారా?' అనబుద్ధి పుట్టిందిగాని, అతని ఉపకారం అననిచ్చింది కాదు. విననట్టు ఊరుకున్నాను.

నా ముఖంలోని రేఖల్ని కనిపెట్టాడు గాబోలు - గట్టివాడు.

సాధువు గెడ్డం అడవి చిన్న నవ్వునవ్వి అంది.

'రిహార్సు' అంటే నాటకం అనుకున్నాను బాబూ, ఏమీ అనుకోకు.

ఏమిటో వెర్రిగాని నాయనా, ఈ లోకం, బతుగూ మాత్రం ఒక నాటకంలా లేదూ.. చూడు ఆ ముందు సీట్లో కూచున్నాయన ఆ షరాయి, కోటుతో, ఎంత బాధపడుతున్నాడో! వేసంకాలం! ఉక్క అయినా ఆ ఇరుకు వేషం మాత్రం మానడు.

నీకా ఖద్దరు బట్టలూ అంతే. దేశాభిమానం. నాకీ జేగురు గుడ్డలూనూ, వైరాగ్యం. అందరం వేషాలవాళ్ళమే..."

'సాధువు గట్టివాడే' అనుకున్నాను.

బస్సు రెండు ఫర్లాంగులు వెళ్ళింది.

సాధువు మెల్లిగా కాలక్షేపం ఉపక్రమించాడు.

"ఈ నిప్పురాలే కాలంలో దూరప్రయాణాలు కష్టం నాయనా. అయితే రాచకీయంగా తప్పదు మరి. ఉద్యోగమా బాబూ అక్కడ?"

"ఉద్యోగం కాదండి. హుషారు కోసమే, సరదాగా తిరగొద్దామని బయలుదేరాను"

"బాగుంది బాబూ, చిన్నతనపు వుత్సాహం అలాంటిదే. 'ప్రయప్రయాస'లు గూడా కనిపించవు..."

"నిజంగానండి. ఈ ప్రయాణాల్లో ఖర్చుకు అంతూదరీ వుండదు. కదిపితే రూపాయలు కరుగుతూండవలసిందే. ఇంతెందుకండీ, ఇప్పుడు ఏభై రూపాయలు పట్టుకు బయలుదేరాననుకోండి. తిరిగి వచ్చేటప్పటికి చిల్లుగవ్వ వుండదు."

"అంతే... అంతే..."

"అయితే ఒకరు కొంచెం ముట్టచెబుతారులెండి. అది యీ యాతాయాతాలకి చెల్లు" అని సంతృప్తిగా నవ్వి వూరుకున్నాను.

"అదృష్టవంతుడవు నాయనా. నీ ముఖంలో మంచి లక్షణాలున్నాయి. ఎక్కడకి వెళ్ళినా నీ మాటకు విలువ వుంటుంది. మాట కరుకుగాని, మనసు దూది. మాయ ఎరుగవు. నీ మెడకింద రేఖలలాంటివి. చెయ్యేదీ?"

ఊపిరి సలపకుండా మాట్లాడాడు.

బైరాగులు, జ్యోతిషాలూ, వేదాంతం, వేరుముక్కలూ, అంటే తలకాయనొప్పి నాకు. కాని అతని దగ్గర ఎందుకో మెత్తబడిపోయాను. నేనివ్వకుండానే బల్లకు ఆనించిన కుడి చెయ్యి తీసి నోరులేని ఆ మూగ గీతల్లో నా పదవి, భాగ్యం, ఇల్లు, పిల్లలూ చదవడం మొదలుపెట్టాడు.

నేను విన్నట్టు నటిస్తూ పరధ్యానంగా బస్సుపక్క పరిగెత్తే చెట్లనూ కాలవల్నీ చూస్తున్నాను.

మాకు పక్కగా బస్సు తాలూకు అగ్గిస్తంభం దగ్గర కూచున్న సకేశి వైశ్యవితంతువు చాలసేపటినుంచి సాధువుతో ఏదో చెప్పాలని చూసిచూసి నా జాతక పఠనం అయాక సాధువుతో అంది.

"బాబూ ఒక్క మనవి వుంది"

యోగీశ్వరుడు అటువైపు తిరిగాడు.

వితంతువు వివరించింది.

"మా పిల్లదానికి నాలుగేళ్ళ నుంచి ఒళ్ళు బాగాలేదు బాబూ. నిద్దర్లో లేచి ఏడుస్తుంది. అప్పుడే నవ్వి పాడుతుంది. మగవాళ్లు కనబడితే తిడుతుంది. ఆకాశంకేసి చూసి దండాలు పెడుతుంది. ఏమిటో తండ్రీ చిన్నపిల్లలకి పెద్దరోగాలు" అంది బెంగగా.

"పిల్ల వయస్సెంత?"

"ఎంతోనా బాబూ, అంతాపోగుచేసి 20 లేవు"

"మగనికేంపని తల్లీ?"

"అబ్బే - ఇంకా పట్నంలో చదువుతున్నాడు బాబూ. వైద్యమో ఏదో, ఇంకా నాలుగే

ళ్లుండాలిట" అంతా గ్రహించినట్టు సూచనగా ఒక పెద్ద మూలుగు మూలిగి కళ్లు మూసుకుని తన పేపసంచీలో చెయ్యిపెట్టాడు.

వితంతువు చెబుతూనే వుంది.

"ఎన్ని వైద్యాలండి. ఒక బైరాగి గాలి అంటే నెల్లాళ్ళు పూజపెట్టి, రాగిరేకులు కట్టి... ఏమీ కార్యం..."

యోగిచేత్తో యేదో సంచిలోంచి తీసి ఆరంభించాడు "అది ఉంటే ఇంకేవమ్మా? ఏడవలేకపోయాడు. పూజలు కాదు. దొంగ బైరాగి ముండా కొడుకుల్ని నమ్మకండి. ఇది కేవలం మనస్సుకు సంబంధించిన రోగమమ్మా! మూలికా వైద్యం చేయించాలి. ఈ మూలిక నాటు బైరాగుల దగ్గర దొరికేదికాదు. హిమవత్పర్వతాల్లో - అనగా మంచుతిని మంచుతాగి కొయ్యయిపోయే చోట ఏళ్ళతరబడి తపస్సుచేసిన నావంటివాళ్లకు గూడా దొరకదు. బ్రహ్మకపాలంలో వున్న మా గురువుగారు సంపాదించి "ఇది మాకెందుకూ ఎవరికేనా ఇయ్యి" అని నాకు దయచెయ్యగా సంచిలో ఉంచాను. సమయానికి పని కొచ్చింది. ఏమీలేదు. పిల్ల ఉలిక్కిపడినప్పుడు కనబడేలా మూడుమాట్లు దిగదుడిచి తల కింద పెట్టండి. తెల్లవారేసరికి నవ్వుతూ లేస్తుంది. ఇందమ్మా" అని ఒక మూలిక ఆమె చేతిలో ఉంచాడు.

ఆమె అందుకుని కళ్లకద్దుకుని కొంగున జాగ్రత్తపరచి, బొడ్డు కొంగులోనుంచి రెండు రూపాయలు తీసి సాధువు చేతిలో పెట్టింది. సాధువు పురుగుల్ని ముట్టుకున్నట్టు ముని వేళ్ళతో రూపాయలు పట్టుకుని తెలిగ్గా నవ్వి అన్నాడు.

"పిచ్చితల్లీ! ఎందుకమ్మా నాకివి? ఏంచేసుకోను?

రోజుకొక్క నిమ్మకాయ, పుడిసెడు గంగ చాలు. ఎక్కువ. డబ్బు మరిగిన బైరాగులకి..."

బస్సు రంయిమని వచ్చి త్రోవలో ఒంతెన దగ్గర ఆగింది.

ఒక కుష్ఠు బిచ్చగాడు "ఎన్నాళ్లుండిన ఇహసుఖములలో - కొన్నాళ్లేగద మనసా..." తత్త్వంపాడుతూ బస్సుచుట్టూ తిరిగి సాధువు దగ్గర చెయ్యి చాచాడు.

సాధువు "ఓం సద్గురుబోధ" అని రెండు రూపాయలూ బిచ్చగాడి చేతిలో పెట్టాడు.

బిచ్చగాడి కళ్లు తిరిగాయి.

బస్సు యావత్తు జనం నివ్వెరపోయింది.

కోమటావిడ చెయ్యెత్తి దండం పెట్టింది.

నేనూ ఆశ్చర్యపడి ఇలాంటివాడు నూటికొక్కడు నిజమైన విరాగి వుంటాడను

కొన్నాను.

సాధువు వినయంగా నిర్లిప్తంగా అన్నాడు.

"బాబూ నా మనస్సుకు ఇప్పుడు తెరిపి అయిపోయింది, బస్"

"ధవళేశ్వరం ఇంకా ఎంతదూరం వుందో" సాధువు తనలో తాను గొణుక్కున్నాడు.

ఆయన దిగిపోతున్నాడంటే బస్సంతా వ్యసనపడ్డారు.

ధవళేశ్వరం వచ్చింది.

సాధువు పేపసంచీ పుచ్చుకుని నిశ్శబ్దంగా దిగి గోదావరి గట్టుకు ఎగువగా వున్న కంకర కొండలవైపు నడిచివెళ్లాడు.

వైశాఖ మాసపుటెండ చుర్రుమంటోంది. సోడా కుర్రాణ్ణి పిల్చి తృప్తిగా పుచ్చుకుని దబ్బులివ్వడానికి లాల్చీ జేబులో చెయ్యి పెట్టాను. శరీరం ముచ్చెమటలు పోసింది.

జేబులో పర్సులేదు!

ఏభై రూపాయలు!

• • •

పక్క పోలీసు స్టేషనులోనుంచి నలుగురు పోలీసులు వచ్చి డ్రైవరుని అడిగారు.

"విశాఖపట్నం జైలునుంచి తప్పించుకుని పారిపోయి ఒక గజదొంగ బైరాగి వేషంలో ఈ ప్రాంతంలో తిరుగుతున్నాడనీ, పట్టుకోమనీ మాకు నిన్న టెలిగ్రాములు వచ్చాయి. అప్పటినుంచీ ప్రతి బస్సూ తనిఖీ చేస్తున్నాం. ఇందులో ఎవరైనా –" అంటున్నారు.

బస్సు ముఖంలో నెత్తురు లేదు.

మండిపడి ... కంకర కొండల్ని ఎర్రగా చూసింది.

• • •